జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 11-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 160 పేజీలు: 8 వెల: రూ.7

## జల్సా కోసం.. దొంగయ్యారు!



* 53 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
* 636 కిలోల రాగి, 5 కిలోల అల్యూమినియం తీగలు తస్కరణ
* విశాఖ వ్యాపారికి విక్రయం
* పది మంది అరెస్టు
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం క్రైం, నవంబరు 10 (వార్త):** జల్సాలకు అలవాటు పడి.. స్నేహితులు దొంగలైన ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. ఏకంగా 53 ట్రాన్స్‌ఫార్మర్లను పగుల గొట్టి వాటి నుంచి రాగి తీగలు, ఇతర సామగ్రిని తస్కరించి ఇతరులకు విక్రయించేసి.. చివరికి పోలీసులకు పట్టుబడ్డారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈ కేసుకు సంబందించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ క్షేత్రాల్లో, రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు కొంతకాలంగా చోరీకి గురవుతున్నాయి. ఇందుకు సంబంధించి జేఆర్‌పురం, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, పొందూరు పోలీసుస్టేషన్ల పరిధిలో 33 చోట్ల , అలాగే మరికొన్ని మండలాల్లోనూ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. రైతులు, విద్యుత్తు శాఖ అధికారుల ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రణస్థలం మండలం బీరు ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న శిథిల భవనం వెనుక భాగంలో దొంగతనాలకు పాల్పడిన ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎచ్చెర్ల మండలం అజ్జారానికి చెందిన కుప్పిలి వరప్రసాద్ అనే వ్యక్తి ఎలక్ట్రికల్ పనుల్లో ప్రావీణ్యం ఉండటంతో పరిసర గ్రామాల్లో ఉన్న కుర్రాలతో స్నేహం పెంచుకుని ట్రాన్స్‌పార్మర్లలో ఉన్న తీగలను దొంగిలించి విశాఖకు చెందిన కృష్ణారెడ్డికి విక్రయించారు. కుప్పిలి వరప్రసాద్, బోరసాయి, బలగ రామకృష్ణ, బలగ శివ, బుడుమారు గోవింద్, సడి సత్యం, దువ్వ అసిరినాయుడు, కృష్ణారెడ్డితో పాటు మరో ఇద్దరు మైనర్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. వీరంతా 53 ట్రాన్స్‌ఫార్మర్లు తస్కరించి, 636 కిలోల రాగి, 5 కిలోల అల్యూమినియం తీగలు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారని, వాటిని పూర్తిస్థాయిలో రికవరీ చేసినట్లు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని సామగ్రిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సా చేసేవారు. చివరికి పోలీసులకు పట్టుబడి కటకటాలు లెక్కిస్తున్నారు. ఈకేసును ఛేదించిన డీఎస్పీ వివేకానంద, జేఆర్‌పురం సీఐ అవతారం, ఎస్‌ఐలు చిరంజీవి, లక్ష్మణరావు, మధుసూదనరావు, కిరణ్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.





## ఆంధ్రా-ఒడిశా బోర్డర్‌లో.. పెద్దపులి

**కాశీబుగ్గ, నవంబర్ 10(వార్త):** ఆంధ్రా-ఒడిశా బోర్డర్ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తుండడంతో ఆయా గ్రామస్థులు భయాదోళన చెదుతున్నారు. కాశీబుగ్గ అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణమ నాయుడు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లోకి సిబ్బంది వెళ్లి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఒడిశాలోని గంజాం జిల్లా జయంతిపురంలో పెద్దపులి దాడిలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ మురళీకృష్ణమ నాయుడు సిబ్బందితో కలిసి ఇచ్చాపురం రూరల్ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో గుంపులుగా వెళ్లాలన్నారు. పులి సంచారంపై ఒడిశా ఫారెస్టు అధికారులతో కలిసి నిఘా పెట్టామన్నారు.



## దేశం గర్వించేలా.. క్రీడాకారులు ఎదగాలి

* చదువుతో పాటు క్రీడలలో రాణించండి
* తైక్వాండో క్రీడకి జిల్లాలో ఆదరణ
* ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం మంచిదే
* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీల ప్రారంభోత్సవం

**శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 10 (వార్త):** భారతదేశం గర్వించే స్థాయికి జిల్లాకి చెందిన క్రీడాకారులు ఎదగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. ఆ దిశగా లక్ష్యాలను నిర్ధేశించుకుని క్రీడాకారులు క్రమ శిక్షణతో రాణించాలని సూచించారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను అధ్యక్షత శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆద్వర్యంలో 38వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ కూర్గీ,13వ జిల్లా స్థాయి పూమ్ సే చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ పోటీల ప్రారంభోత్సవం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. తైక్వాండో క్రీడకి జిల్లాలో ఆదరణ బాగా ఉందన్నారు. తైక్వాండో శ్రీను క్రీడాకారుల కోసం చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. మెడల్స్ సాధించని వారు నిరాశకి గురికాకుండా మరింతగా ప్రాక్టీస్ చేసి ముందుముందు జరిగే పోటీలలో విజేతలుగా నిలిచేందుకు కృషి చేయాలన్నారు. నిపుణులైన కోచ్ లు ఇచ్చే సూచనలు పాటిస్తూ నిరంతరం సాధన చేయడం ద్వారానే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించగలరన్నారు. ఆత్మ రక్షణ విద్యను నేర్చుకోవడం అందరికి



మంచిదేనన్నారు.జిల్లా స్థాయి పోటీలలో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్ళబోయే వారికి ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపి తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ వర్మ, బహుజన నేత డా.కంఠ వేణు, తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం నియోజకవర్గ యువ నాయకుడు రెడ్డి శంకర్ , న్యూట్రీషన్ కోచ్ నాగరాజు, సహారా కృష్ణ, సంపతిరావు గోవిందరాజులు(నాయుడు) తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకి జిల్లా నలుమూలల నుంచి సబ్ జూనియర్స్ కేటగిరికి చెందిన క్రీడాకారులు విచ్చేసారు. ఈ పోటీలలో కోచ్‌లు తైక్వాండో గౌతమ్, తైక్వాండో నవీన్, జోగుపాటి వంశీ, వైశ్యరాజు జాస్మిన్, మదన్, బాలాజీ, గణసాయి, రాహుల్, జనార్ధన్, హరి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీముఖలింగంలో పారిశుధ్య లేమి

**జలుమూరు, నవంబర్ 10(వార్త):** శ్రీముఖలింగంలో కొలువైన శ్రీముఖలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అపారిశుధ్యం స్వాగతం పలుకుతోంది. గ్రామ ముఖద్వారంతో పాటు ప్రధాన ఆలయ పరిసరాల్లోనూ చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. కార్తీక మాసంలో శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అయితే ఎక్కడికక్కడే చెత్త నిల్వతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు మత్రం స్పందించడం లేదు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం కట్టిన మూత్రశాలలకు తాళాలు వేసేశారు. దీంతో భక్తులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.



# సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ..!

**-గ్రామాల్లో మొదలైన హడావిడి**



**వంగర, నవంబర్ 10(వార్త):** సుదీర్ఘకాలం తర్వాత సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లా అంతటా హడావిడి మొదలైంది. గత ఐదేళ్లలో వైఎస్సార్సీపీ సర్కార్ ఈ ఎన్నికల ఊసే ఎత్తలేదు. కూటమి సర్కార్ మాత్రం ప్రస్తుతం నీటి వినియోగదారుల సంఘాలు, పంపిణీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో సందడిగా మారింది. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటైతే సాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టే వీలుంటుంది. మరోవైపు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నికల తర్వాత రాష్ట్ర స్థాయి అపెక్స్ కమిటీకి ప్రాధాన్యం సంతరించుకోనుంది. సాగునీటి రైతులకు ఆయకట్టు పరిధిలో సాగునీటి ఇబ్బందులు తొలగించి చివరి భూములకు నీరందించేలా పర్యవేక్షణ చేసేందుకు కాలువల వారీగా సాగునీటి సంఘాలకు శ్రీకారం చుట్టారు. పంట కాలువల, మురుగు కాలువల మరమ్మతులు, రైతుల సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో 1999లో ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత 2015లో ఆ సంఘాలను టీడీపీ సర్కార్ పునరుద్ధరించింది. వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 సెప్టెంబర్‌లో సాగునీటి వినియోగదారుల సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీని రద్దు చేసింది. దీంతో ఆ బాధ్యతలను జలవనరుల శాఖ అధికారులే నిర్వహించాల్సి వచ్చింది. సాగునీటి సంఘాలను విస్మరించి పంట కాలువలను గత ప్రభుత్వం నాశనం చేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంగర మండలంలోని మడ్డువలస మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సంబంధించి ఇదే మొదటి ఎన్నికగా చెప్పాలి. ఇంత వరకూ ఈ ప్రాజెక్టు నీటి సంఘం ఎన్నిక జరగలేదు. అంతేగాకుండా మండలంలో ఎనిమిది నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఇందులో రాజులగుమ్మడ, తలగాం, శివ్వాంకు సంబంధించి తోటపల్లి కాల్వల మేజర్ ఇరిగేషన్ నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. మీడియం ఇరిగేషన్ సంఘాలుగా మడ్డువలస జలాశయ పథకం, ఇరువాడ కాల్వ, పెదంక్లాంకి ఎన్నికలు జరగనున్నాయి. మైనర్ ఇరిగేషన్ కింద కింజంగి, అరసాడ, కొండ చాకరాపల్లి గ్రామాల్లో చెరువులు తదితరాలకు సంబంధించి నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం మండల స్థాయి అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.



## కళింగ సంక్షేమ అభివృద్ధికి సహకరించండి

**జలుమూరు, నవంబర్ 10(వార్త):** రాష్ట్ర కళింగ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రోణంకి కృష్ణంనాయుడు ఆధ్వర్యంలో సంఘం మరింత అభివృద్ధి పథంలో పయనించాలని నరసన్నపేట సంక్షేమ సంఘ సభ్యులు కోరారు. ఆదివారం ఆయనను నరసన్నపేటలోని తన నివాసంలో సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళింగ సంక్షేమ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేయాలని, తామంతా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ప్రముఖ వైద్యులు బలగ మురళి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు



**జలుమూరు, నవంబర్ 10(వార్త):** ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని నరసన్నపేట ఎక్సైజ్ సీఐ రమణ మూర్తి హెచ్చరించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క షాపు వద్ద మద్యం ధరల పట్టికను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టిక ప్రకారమే మద్యం బాటిల్స్ అమ్మకాలు చేపట్టాలన్నారు. గతనెల 29 నుంచి నేటి వరకు 14 కేసులు నమోదు చేశామన్నారు.

# తాళ్లభద్రలో ఆధ్యాత్మిక శోభ

**-రేపటి నుంచి రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు**

**సోంపేట, నవంబర్ 10(వార్త):** సోంపేట మండలం తాళ్లభద్రలోని శ్రీ రామమందిరం ప్రారంభానికి ముస్తాబైంది. గ్రామంలోని దిగువ వీధిలో ఆలయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో వీధి వాసులు రామ మందిరం పునర్నిర్మాణానికి నడుము బిగించారు. ఏడాది కిందట మందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీధి వాసులంతా కలిసి విరాళాలు వేసుకున్నారు. గ్రామస్తుల సహకారం కూడా తీసుకున్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు ఇచ్చారు. ఈ తరుణంలో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈనెల 12 నుంచి రెండు రోజులపాటు ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. బ్రహ్మశ్రీ కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో రుత్వికుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రారంభ వేడుకలు కొనసాగనున్నాయి. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించనున్నారు. బుధవారం ఉదయం రామ మందిరం ప్రతిష్ఠ వేడుకలు జరగనున్నాయి. ఆరోజు భారీ అన్నప్రసాద వితరణ జరగనుంది. దాదాపు పదివేల మంది భక్తులు హాజరవుతారని అంచనా. రెండు రోజులపాటు ప్రముఖ కళాకారులతో భజన కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు యూత్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.



## సంగమేశ్వరుడిని దర్శించిన సీఐ ఉపేంద్ర



**వంగర, నవంబర్10(వార్త):** సంగాం సంగమేశ్వరస్వామిని రాజాం సీఐ హెచ్. ఉపేంద్రరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సిద్దాంతం గణపతిరావు, సిద్ధాంతం శంకరరావు ఆశీర్వచనాలు అందజేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేంద్ర దంపతులు దర్శించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ‘హ్యాపీనెస్’తో ఆరోగ్యం..ఆనందం..!

**పోలాకి, నవంబర్ 10(వార్త):** ఆరోగ్యం, ఆనందం హ్యాపీనెస్‌తో సాధ్యమని నరసన్నపేట శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం మబగాంలో జరిగిన హ్యాపీనెస్ కోర్స్ ముగింపోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రవిశంకర్ గురూజీ ఆశీస్సులతో ఆరు రోజులుగా జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తున్న ఈ కోర్స్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవితంలో యోగా ఒక భాగం కావాలని, అప్పుడే ఆనందమాయమైన జీవితం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కోర్స్‌లో ప్రతరోజూ పాల్గొన్నానని, ఇది జీవితానికి చాలా ఉపయోగమన్నారు. ప్రముఖ వైద్యులు కింజరాపు అమ్మన్నాయుడు మాట్లాడుతూ జీవితంలో సాధన (యోగా), సేవ, సత్సంగం ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని



పిలుపునిచ్చారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ దేసూళ సురేంద్ర మాట్లాడతూ, ఆనందంతో సంబంధాలను, సంతోషాలను పొందాల్సిన మనిషి అహంతో దూరం చేసుకొంటున్నారన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ వారణాసి సందీప్ యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, సుదర్శన్ క్రియ చేయించారు. కార్యక్రమంలో బగ్గు సుగుణమ్మ, జుత్తు తాతారావు, రామారావు, సుమారుగా 55 మంది సాధకులు పాల్గొన్నారు. అనంతరం కరుకోల సీతారామ నగర సంకీర్తన భజన మండలి, మబగాం దోమ రామినాయుడు, తెలుగు అప్పారావు, జుత్తు తాతబాబు ఆధ్వర్యంలో జరిగిన సత్సంగంలో భక్తిభజన గీతాలు, పాటలతో అందర్నీ ఆసాంతం ఆకట్టుకున్నారు.

## ధర్మ పరిరక్షణ కోసమే ఆలయ విరాళాలు

**సోంపేట, నవంబర్ 10(వార్త):** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరగబోయే హైందవ శంఖారావం బహిరంగ సభకి సన్నాహక సమావేశం ఆదివారం సోంపేటలోని కళింగ వైశ్య సంఘ భవనంలో జరిగింది. వీహెచ్‌పీ ఆంధ్రప్రాంత మఠమందిర ప్రముఖ్ ఫల్గుణరావు మాట్లాడుతూ హిందూ దేవాలయాలు హిందువుల ఆధ్వర్యంలోనే నడపబడాలని కోరారు. దేవాలయాల విరాళాలు, ఆస్తులు హిందూ ధర్మ పరిరక్షణ కోసం మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ సహ కార్యవాహ కర్రి లింగరాజు, రంగోయి హేమంత్, ఎస్ఎస్ఎఫ్ సంయోజక్ కర్రి గిరిబాబు, కొంచాడ వేణుగోపాలరావు, తెప్పల కృష్ణారావు, ఆలేటి విజయరావు, సోంపేట, కంచిలి మండలాల నుంచి 90 మంది ప్రముఖులు పాల్గొన్నారు.



# పర్యాటకుల సందడితో అప్రమత్తమైన పోలీసులు



**పోలాకి, నవంబర్ 10(వార్త):** పోలాకి మండలంలోని బీచ్ ప్రాంతాలకు పర్యాటకుల సందడి పెరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆదివారం రాజారాంపురం సముద్రపు ఒడ్డున పర్యాటకుల సందడి కనిపించింది. భక్తులకు, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కంటి శస్త్ర చికిత్సలకు 25 మంది ఎంపిక

**జలుమూరు, నవంబర్ 10(వార్త):** నరసన్నపేట మండలం కోమార్తి పంచాయతీలో మాజీ సర్పంచ్ సిమ్మ జగన్నాథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య నేత్ర శిబిరంలో 25 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఆదివారం జిల్లా అంధత్వ నివారణ కేంద్ర నిర్వహణలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. ఉర్లాం పీహెచ్సీ వైద్యాధికారిణి సుజాత సమక్షంలో చేపట్టిన శిబిరంలో 55 మందికి పరీక్షలు నిర్వహించారు.






## శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించిన కలెక్టర్

**జలుమూరు, నవంబర్ 10(వార్త):** దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ స్వప్నిల్‌దినకర్, కుటుంబసభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలను నిర్వహించారు. అనంతరం వేదడ ఆశీర్వచనాలు, తీర్ధ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట ఆలయ ఈవో పి.ప్రభాకర్, శ్రీముఖలింగ సర్పంచ్ టి.సతీష్ ఉన్నారు.



## క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

**జలుమూరు, నవంబర్ 10(వార్త):** చిత్తూరు జిల్లాలో ఇటీవల జరిగిన స్కూల్ మీట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నరసన్నపేట మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయం సాధించారు. దీంతో ఆదివారం వారిని కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అభినందించారు. మరెన్నో పోటీల్లో విజేతలుగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాయికన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు, విద్యార్థులు



తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుతో టీడీపీ బలోపేతం

**మందస, నవంబరు 10(వార్త):** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుతోనే పార్టీ బలోపేతం అవుతుందని టీడీపీ మాజీ ఎంపీటీసీ, మాజీ అధ్యక్షుడు దాసరి తాతారావు అన్నారు. మందసలోని ఉద్దాన ప్రాంతమైన లోహరిబంద పంచాయతీ ధర్మపురంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు దాసరి తాతారావు, అందాల రామారావు, పిన్నింటి హరికృష్ణ, ధర్మాన దుర్యోధన, తాళ్ళ జోగారావు, పిన్నింటి కార్తీక్, నవీన్, ప్రశాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## చోరీ బైక్‌లు స్వాధీనం

**ఇచ్ఛాపురం, నవంబర్ 10(వార్త):** ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన కిరణ్‌కుమార్ జన అలియాస్ లిట్టును స్కై డ్రాప్ జంక్షన్ వద్ద ఇచ్ఛాపురం టౌన్



# మానవ జీవనానికి దిక్సూచి శ్రీరాముడు



**పోలాకి, నవంబర్ 10(వార్త):** అద్భుతాలు, అనుబంధాలు పొందుతున్న మానవజన్మ ఎంతో గొప్పదని విజయనగరానికి చెందిన ఆధ్యాత్మిక వక్త తల్లాప్రగడ అరుణమ్మ అన్నారు. ఆదివారం చింతాడపేటలో జరిగిన ప్రవచనాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవనం సాగించుటకు ఎన్నో ఇతిహాసాలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. భగవద్గీత లాంటి ఆధ్యాత్మిక గ్రంథం ప్రపంచం అంతటికీ ఆదర్శం అన్నారు. మానవ జీవన విధానంలో శ్రీరాముడు ఎంతో ఆదర్శనీయుడని నిరూపించినట్లు చెప్పారు. మనిషి ప్రశాంతత, ఆరోగ్యం, సుఖం పొందుటకు భగవద్గీత లాంటి గ్రంథం ఎంతో అవసరమని చెప్పారు. రామయోగి సేవాశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు బమ్మిడి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్రహ్మచారి ప్రకాశానంద స్వామి, అప్పలనాయుడు, గోపాలస్వామి, లక్ష్మణరావు గోవిందరావు, శాంతారావు, ఆధ్యాత్మిక ప్రియులు పాల్గొన్నారు.



# 13న పలాసలో అయ్యప్ప పడి పూజ



**కాశీబుగ్గ, నవంబర్ 10(వార్త):** పలాస మున్సిపాలిటీలోని పాత జాతీయ రహదారి సమీపన పద్మానాబపురం వద్ద వెలసిన శ్రీదత్త అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం ఉదయం 9గంటలకి అయ్యప్పస్వామి వారి పడి పూజ జరుగుతుందని గురుస్వాములు కొండే నరసింహ, పార్వతీశం తెలిపారు. ఆ రోజు చిలుకల ద్వాదశి సందర్భంగా ఉసిరికి చెట్టు కింద, భారీ వన భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిసర ప్రాంత అయ్యప్పస్వాములు ఈ పూజకు హాజరుకావాలని వారు కోరారు. ఆరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి జరిగే వనభోజనం కార్యక్రమానికి మున్సిపాలిటీతో పాటు పరిసర ప్రాంత ప్రజలు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి ఆ మణికంఠుని కృపకి పాత్రులు కావాలని ఆలయ వ్యవస్థాపకులు శ్రీరామస్వామి కోరారు.

# పంచారామాలకు పయనమైన బస్సులు

**శ్రీకాకుళం, నవంబర్ 10(వార్త):** పంచారామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను శ్రీకాకుళం బస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం 1, 2 డిపోల మేనేజర్లు అమంసింహుడు, శర్మ జెండా ఊపి ప్రారంభించారు. కార్తీక మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఈ సర్వీసులలో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో గల శివాలయాల దర్శనానికి వెళ్తారని చెప్పారు. ఈ నెల 17, 24 తేదీల్లో కూడా బస్సులు నడుపుతామన్నారు. "ఒక్క ఫోన్ కాల్ తో మీ వద్దకు ఆర్టీసీ బస్సు" అనే నినాదంతో ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99592 25608, 99592 25609, 99592 25610, 99592 25611 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.



# అశ్రు నయనాల మధ్య సంతోష్ అంత్యక్రియలు

**-విషాదం మిగిల్చిన ప్రమాదం**

**-మందసలో విషాదఛాయలు**

**మందస, నవంబరు 10(వార్త):** కష్టపడి బతుకుతూ.. పదిమందికి ఉపాధి కల్పించాలన్న ఆయన ఆశయం మధ్యలోనే ఆగిపోయింది. ఎల్లప్పుడూ సిబ్బందిని ఎంతో గౌరవంగా చూసుకునే ఆ యువ వ్యాపారవేత్త సంతోష్ కుమార్ అనంతలోకాలకు వెళ్లిపోయి.. ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచేశారు. మందసలోని కరణం వీధికి చెందిన వడ్డి సంతోష్‌కుమార్ మందసకు రెండు కిలోమీటర్ల దూరంలో గల రాధాకృష్ణపురం సమీపంలో మోడరన రైస్ మిల్లును నడుపుతున్నారు. ప్రతీ రోజూ ఆయన మిల్లుకు వచ్చేవారు. శనివారం రాత్రికూడా ఆయన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, బ్రిడ్జి స్కూల్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఆయనను ఆటో ఢీకొనగా, తుళ్లిపడి కిలోమీటరు రాయిని బలంగా తాకడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. 108లో పలాస తీసుకెళ్తున్న సమయంలోనే పరిస్థితి విషమించి మరణించారు. ఎంతో సౌమ్యుడైన సంతోష్‌కుమార్ మరణంతో మందసలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతునికి భార్య సుప్రియ, కుమారులు శ్రీకరణ్, శ్రీశరణ్ ఉన్నారు. ఆదివారం హరిపురం సీహెచ్‌సీలో పోస్టుమార్టం అనంతరం సంతోష్ అంత్యక్రియలు.. రక్త సంబంధీకులు, బంధువులు, స్నేహితుల అశ్రు నయనాల మధ్య మందసలో అంత్యక్రియలు జరిగాయి. మరో కిలోమీటరు దాటితే ఇంటికి వెళ్లిపోతాడని అనుకున్న ఆయన అనంతలోకాలకు వెళ్లిపోయారని, విధి ఎవరిని.. ఎలా పొట్టన పొట్టుకుంటోందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వడ్డి సంతోష్‌కుమార్ (ఫైల్)

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 13న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

**ఇచ్ఛాపురం, నవంబర్ 10(వార్త):** ఇచ్ఛాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల13న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవాలని సీజీఆర్ఎఫ్ కార్యదర్శి గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సమస్యల పరిష్కార వేదికలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మసీలమణి, స్వతంత్ర సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ పాల్గొంటారన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి జరగనున్న ఈ వేదికను ఇచ్ఛాపురం మున్సిపాలిటీతో పాటు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# శ్రీకాకుళం- కన్యాకుమారి సైకిల్ యాత్ర విజయవంతం

**శ్రీకాకుళం, నవంబర్ 10(వార్త):** శ్రీకాకుళం టు కన్యాకుమారి వరకు సైకిల్ యాత్రను శ్రీకాకుళం నగరానికి చెందిన యాగాటి ఉదయ్ విజయవంతంగా పూర్తి చేసి సిక్కోలుకు పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. భారతదేశం మొత్తంగా ఇప్పటి వరకు ఎవ్వరూ సాధించని ఘనత తన సొంతం చేసుకున్నారు. 22 రోజుల్లో 1900 కిలోమీటర్లు శ్రీకాకుళం టు కన్యాకుమారి వరకు సైకిల్ మీద ప్రయాణించి, శ్రీకాకుళానికి గుర్తింపు తెచ్చారు. యువత డ్రగ్స్‌కి బానిసలు కాకూడదని, ఆడవారిని గౌరవించాలని అనే నినాదంతో సైకిల్‌యాత్రని అక్టోబర్ 15న మొదలు పెట్టి ఈ నెల 7న పూర్తి చేసినట్లు ఉదయ్ తెలిపారు. ఆయనకు సిక్కోలు వాసులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.



# మృతుని కుటుంబానికి రూ.40వేల ఆర్థిక సాయం



**మందస, నవంబరు 10(వార్త):** మందస మండలం అంబుగాంలో భవన నిర్మాణ కార్మికుడు మజ్జి కూర్మారావు కొద్దిరోజులుగా అనారోగ్య కారణాలతో బాధపడుతూ మరణించాడు. కూర్మారావుది పేద కుటుంబం కావడంతో, అదే గ్రామానికి చెందిన నవోదయ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆ కుటుంబానికి రూ.40వేలు ఆర్థిక సహాయం అందజేసింది. మృతుడి భార్య సరస్వతికి ఈ మొత్తాన్ని నవోదయ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నవోదయ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బల్ల మాధవరావు, ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా కోశాధికారి దేవాడనారాయణరావు, మామిడి గోపాలు, మజ్జి శివకేశ్వర రావు, దేవాడ యామరాజు, మజ్జి విశ్వనాథం, తోట గోపాలు పాల్గొన్నారు.

# విశ్వశాంతికి అఖండ భజన దివ్యనామ సంకీర్తన

**కాశీబుగ్గ, నవంబర్ 10(వార్త):** విశ్వశాంతి కోసం విశ్వవ్యాప్త అఖండ భజన శ్రీసత్యసాయి సేవాసమితి భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నవంబర్ నెల రెండో శనివారం సాయంత్రం 6గంటల నుంచి రెండో ఆదివారం సాయంత్రం 6గంటల వరకు ఒకే సమయంలో జరుగుతుంది. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి రామకృష్ణపురంలో జరుగుతున్న అఖండ భజనలో శ్రీ సత్యసాయి విద్యా విహార్ రామకృష్ణాపురం విద్యార్థులు ఆదివారం 90 నిమిషాలు భక్తి, శ్రద్ధలతో భజన చేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ డోకి జగదీష్, స్కూల్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, శరత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# తల్లిపాలే బిడ్డలకు శ్రీరామ రక్ష



**శ్రీకాకుళం, నవంబర్ 10(వార్త):** శ్రీకాకుళం నగర పరిధిలోని 31వ డివిజన్ దండి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలను పండుగ వాతావరణంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన 31వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి విభూతి సూరిబాబు మాట్లాడుతూ తల్లి పాలే బిడ్డలకు శ్రీరామరక్ష అని చెప్పారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, అందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని గుర్తు చేశారు. పౌష్టికాహారంతో అనారోగ్యం దూరం అవుతుందన్నారు.కోడిగుడ్లు, పోషకాహారం గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రధాన విజయరాం, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, జయకుమారి, బాలిం తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## వంశధార ఆధునికీకరణపై శాసనసభలో విన్నవిస్తా



**జలుమూరు, నవంబర్ 10(వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో 67 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న వంశధార ఆధునికీకరణ, అభివృద్ధితో పాటు, కరకట్టల నిర్మాణంపై రాష్ట్ర శాసనసభలో నివేదిస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆదివారం ఆయన నరసన్నపేటలో విలేఖరులతో మాట్లాడారు. జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు అందిస్తున్న తాగునీటిపై కూడా విన్నవిస్తానన్నారు.

## కొరికానకు పదవిపై హర్షం



**కొత్తూరు, నవంబర్ 10(వార్త):** శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ నాయకుడు కొరికాన రవికుమార్‌ను శ్రీకాకుళం జిల్లా అర్బన్ అథారిటీ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా జనసేన కొత్తూరు మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కొత్తూరులో బాణసంచా కాల్చి కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రవికుమార్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని జనసేన పార్టీ నాయకులు దుంప జయరాం, అదపాక అశోక్, ఇసాయి వెంకటేష్, మడపాన అనిల్‌కుమార్, సింహాచలం, పొగిరి మనోజ్, చంటి ఆకాంక్షించారు.

## కొండ చిలువ హతం



**ఇచ్ఛాపురం, నవంబర్ 10(వార్త):** దానంపేటలో సుమారు 9 అడుగుల భారీ కొండ చిలువ స్థానికులు చేతుల్లో హతమైంది. ఆదివారం ఉదయం కార్తీక నదీ స్నానాలకి వెళ్తున్న వాళ్లు చూసి తొలుత భయభ్రాంతులకు గురయ్యారు. కానీ అంతలోనే తేరుకుని హతమార్చారు.

## ఘనంగా సత్యసాయిబాబా అఖండ భజన

**జలుమూరు, నవంబర్ 10(వార్త):** సత్య సాయిబాబా 99వ జయంత్యుత్సవాల్లో భాగంగా ప్రపంచవ్యాప్త అఖండ నామ భజన అల్లాడలో ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం 6. గంటలకు ప్రారంభించి ఆదివారం సాయంత్రం 6. గంటలకు ఈ భజన కార్యక్రమాల్ని ముగించారు. జిల్లాలోని వివిధ మందిరాలలో ఈ అఖండ నామ భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సారవకోట మండలం నుంచి పలు భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546